# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 79 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 15 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4




## ప్రేరణతో ప్రోత్సాహం

- విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యమే..
- కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

4లో

# వచ్చినోడికి రూ. 2 కోట్లు

## పట్టుకొచ్చినోడికి రూ.10 లక్షలు

- ఆఫర్లు ప్రకటించిన ప్రధాన పార్టీలు
- జనగామలో జర్నలిస్ట్ల పాలి'టిక్స్' మొదలు
- బేరసారాలు మొదలు పెట్టిన మధ్యవర్తులు, జర్నలిస్టులు

**జనగామ మున్సిపాలిటీ** పాలిక్స్ పీక్స్ కు చేరుకున్నాయి.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెరి 13 చొప్పన సమాన సీట్లు రావడం.. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించిన విషయం తెలిసిందే.. అయితే స్వతంత్రుల్లో ఇద్దరు ఓ పార్టీకి.. మరో ఇద్దరు ఇంకో పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ 15 చొప్పన కౌన్సిలర్లు అవుతుండగా.. ఎక్స్ అఫీయో మెంబర్లుగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో ఇరు పార్టీల మెజార్టీ 16 : 16 గా మారింది. చైర్మన్ సీటుకు ఇరు పార్టీలకు ఒకరి మద్దతు అవసరం కావడంతో.. కౌన్సిలర్లకు ఆఫర్లు ప్రటించినట్టు తెలుస్తోంది. వచ్చిన వారికి రూ.2 కోట్ల వరకు ముట్టజెప్పడంతో పాటు పాలకవర్గంలో తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇక వారిని ఒప్పించి పట్టుకుచ్చే వారికి కూడా రూ.10 లక్షల వరకు ఇచ్చేందుకు కొందరితో బేరాలు కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో ముఖ్య నాయకులే కాదు.. జనగామలో జర్నలిస్టులు కూడా  ఉండడం గమనార్హం. క్యాంపులో ఉన్న నాయకలతో మాట్లాడేందుకు జర్నలిస్టులతేనే సులువు అవుతుందని వారికి పార్టీలు ఈ ఆఫర్ ఇచ్చారని తెలిసింది. ఈ క్రమంలో జనగామలో కొందరు జర్నలిస్టులు కౌన్సిలర్లను  జంపింగ్ చేయించేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

- ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా












# బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు

- ప్రత్యేక ఆర్టీసీ బస్సులు
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృషి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**పాలకుర్తి, మన చౌరాస్తా** : పాలకుర్తి శ్రీ సోమేశ్వర శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా, సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవస్థానం, విద్యుత్, పోలీస్, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్, ఇతర అధికారులతో శనివారం దేవస్థానం కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున.. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రత చర్యలతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అలాగే వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలిచే విధంగా చూడాలని సూచించారు. బ్రహ్మోత్సవాలు జరిగే ప్రదేశాల్లో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ శాఖ తెలుపగా.. అవసరమైతే అదనంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని.. పారిశుద్ధ్య కార్మికులకు డ్రెస్ కోడ్ తో పాటు దశలవారీగా విధులు కేటాయించాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు సిబ్బందిని నియమించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో క్యూలైన్లను లడ్డు తయారు చేసే రూములను పోలీస్ కంట్రోల్ రూమ్ డిఆర్డిఓ ద్వారా ఏర్పాటు చేసిన వస్తువుల విక్రయ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో ఆలయ ఈఓ లక్ష్మి ప్రసన్న, డీఆర్డీవో వసంత, ఏసీపీ నర్సయ్య, విద్యుత్ శాఖ డిఈ సారయ్య, ఎంపీడీవో వేదవతి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ నవీన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సుకు కోడంకుమార్ కు ఆహ్వానం



**జనగామ, మన చౌరాస్తా** : జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, పరిశోధకుడు, ఎల్. బీ. బిఈడి కళాశాల సీనియర్ తెలుగు అధ్యాపకుడు కోడం కుమార స్వామికి మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న చరిత్ర జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 17, 18 తేదీల్లో ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో నిర్వహిస్తున్న "ఐరన్ మ్యాన్స్ విజినరీ లీడర్షిప్ లిబరేషన్ ఆఫ్ హైదరాబాద్ " అనే అంశంపై రెండు రోజుల సదస్సు జరగనుంది. ఈ సదస్సులో కోడం కుమారస్వామి "కాళోజీ కవిత్వం నిజాం పాలన వ్యతిరేకత" అనే అంశంపై కాళోజీ సాహిత్య రచనల్లో నిజాం పాలనలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు వ్యతిరేకించిన తీరు తెన్నులపై పరిశోధన పత్ర సమర్పణ చేసి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా జనగామ రచయితల సంఘం అధ్యక్షులు నక్క సురేష్ , కవులు కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు జి.కృష్ణ, సోమేశ్వర్, పానుగంటి రామ్మూర్తి, శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

## సోమేశ్వరాలయంలో మహా జాతర ప్రారంభం

**పాలకుర్తి, మన చౌరాస్తా** : శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, మహా జాతర ప్రారంభమైంది. ధ్వజారోహణ, గణపతి పూజతో వేద పండితులు, అర్చకులు జాతరను శనివారం ప్రారంభించారు. సర్పంచి విజయ నాగన్న గౌడ్, ఏసిపి నరసయ్య, అర్చకులు లక్ష్మన్న, అనిల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.





### ఆబాద్ లయన్స్ ఆధ్వర్యంలో

## వెండర్ గొడుగుల పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా** : లయన్స్ క్లబ్ జనగామ ఆబాదు ఆధ్వర్యంలో శనివారం నాడు రోడ్డుపై వ్యాపారం చేసుకుని చిరు వ్యాపారులకు నీడనిచ్చే ఎందరు గొడుగులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ నూతన శతాబ్ది నినాదం "వేర్ దేర్ ఈస్ ఏ నీడ్ దేర్ ఈస్ ఏ లయన్" నినాదం స్ఫూర్తి తో చిరు వ్యాపారుల అవసరార్థం గొడుగులు వితరణ చేయడం అభినందనీయం అన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు పబ్బ చంద్రశేఖర్ సౌజన్యం తో ఈ రోజు గొడుగులు వితరణ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు లయన్ కారంపూడి సత్యనారాయణ తెలిపారు. కోశాధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ఎలికట్టె నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ముల్కనూరులో మెగా ఉచిత వైద్య శిబిరం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా** : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి అప్పయ్య తెలిపారు. శనివారం నాడు త్వరలో ముల్కనూరు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసే స్థలాన్ని ఆయన పరిశీలించారు. స్వాతంత్ర సమరయోధుల భవనం దాని పరిసర ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసే విధంగా సౌకర్యాలు ఏర్పాటు తదితరు అంశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, ముల్కనూర్, వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రాజశేఖర్, రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రెస్ కొమురయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గజ్జెల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జక్కుల అనిల్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పోగుల శ్రీకాంత్,సీనియర్ నాయకులు ఊసకోయల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసగోని బాలకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## చోరీ అనుమానితుల ఫోటోల విడుదల




**హనుమకొండ, మన చౌరాస్తా** : ధర్మసాగర్ పరిధిలోని కరుణాపురం చర్చిలో ప్రార్థనలు అనంతరం హనుమకొండ భీమారం ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి అనే మహిళ మెడలోని పుస్తెల తాడు చోరీకి గురైంది. దీంతో ఫిర్యాదు అందుకున్న ధర్మసాగర్ పోలీసులు, దర్యాప్తు అనంతరం ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు అనుమానిత మహిళలకు సంబంధించి విడుదల చేశారు. ఎవరైనా ఈ మహిళలను గుర్తిస్తే 8712685127 నంబర్ కు సమాచారం ఇవ్వాలని ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ తెలిపారు.



# ముత్తారం త్రికూటాలయం

- శివ, విష్ణు, సూర్య ఆరాధనల అపూర్వ సంగమం
- కాకతీయుల ఖగోళ శిల్ప విజ్ఞానానికి జీవంత సాక్ష్యం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామం చరిత్ర, ఆధ్యాత్మికత, శిల్పకళ, ఖగోళ విజ్ఞానం ఈ నాలుగు ఒకే చోట సమ్మిళితమై కనిపించే అరుదైన ఆలయం ముత్తారం త్రికూటాలయం. శిలల్లో చెక్కిన శివతత్వం, ప్రతి శిల్పంలో ప్రతిఫలించే భక్తిభావం, ఆలయ నిర్మాణంలో దాగి ఉన్న శాస్త్రీయ దృష్టి ఇవన్నీ కలసి ఈ క్షేత్రాన్ని కాకతీయుల కాలపు అపూర్వ వారసత్వంగా నిలబెడుతున్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ చెరువు కట్టపై, రాతిబోడు అరగుట్టును ఆనుకొని ఈ త్రికూటాలయం వెలసి ఉంది. గ్రామానికి రక్షణ దేవాలయంగా భావించే ఈ ఆలయం, నేటికీ భక్తుల విశ్వాసానికి కేంద్రంగా నిలుస్తోంది.

## వేయి స్తంభాల గుడిని తలపించే నిర్మాణ శైలి

హనుమకొండలోని ప్రసిద్ధ వేయి స్తంభాల ఆలయానికి ప్రతిరూపంగా అనిపించే ఈ త్రికూటాలయం, కాకతీయుల నిర్మాణ కళా వైభవాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. సుమారు 1.70 మీటర్ల ఎత్తులో నక్షత్రాకార అధిష్ఠాన వేదికపై ఆలయాన్ని నిర్మించడం అప్పటి వాస్తు నిపుణుల దూరదృష్టిని చాటుతోంది. త్రికూటాలయ లక్షణాలకు అనుగుణంగా ఈ ఆలయంలో మూడు గర్భాలయాలు ఉన్నాయి. ◌ార్వ అభిముఖంగా శివ గర్భాలయం, ఉత్తరాభిముఖంగా ఆదిత్య (సూర్య) గర్భాలయం, దక్షిణాభిముఖంగా కేశవమూర్తి గర్భాలయం ఏర్పాటు చేశారు. ఇది శైవ, వైష్ణవ, సౌర సంప్రదాయాల సమన్వయానికి గొప్ప ప్రతీకగా నిలుస్తోంది.


## సంధ్యా సమయంలో

## శివలింగాన్ని తాకే సూర్యకిరణాలు

ఈ ఆలయాన్ని మరింత విశిష్టంగా నిలబెట్టే అంశం—సంధ్యా సమయంలో పడమర దిక్కునుంచి వచ్చే సూర్యకిరణాలు నేరుగా శివలింగాన్ని తాకేలా చేసిన నిర్మాణ రహస్యం. ఖగోళ గణనలతో కూడిన ఈ ఆలయ రూపకల్పన, కాకతీయుల కాలంలో ఖగోళ శాస్త్రం ఎంత అభివృద్ధి చెందినదో తెలియజేస్తోంది.







## అరుదైన శివలింగాలు..

## శిల్పుల నైపుణ్యానికి నిదర్శనం

ప్రధాన గర్భగుడిలో ఉన్న ఎత్తయిన శివలింగం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఉత్తర గర్భాలయంలో మరో అరుదైన శివలింగం దర్శనమిస్తుంది. ఈ శివలింగాలు గ్రానైట్ రాయితో నిర్మించబడినవి కాగా, వాటిపై కనిపించే బ్రహ్మసూత్రాలు శిల్పకళా పరంగా అరుదైన అంశంగా చరిత్రకారులు పేర్కొంటున్నారు.

## ధ్వంసానికి గురైన కేశవమూర్తి గర్భాలయం

దక్షిణాభిముఖంగా ఉన్న కేశవమూర్తి గర్భాలయం కాలగతిలో తీవ్రంగా ధ్వంసమైంది. విగ్రహం శిరస్సు, పరహస్తాలు నశించినప్పటికీ, శంఖ-చక్రాల ఆనవాళ్లు, చేతుల కంకణాలు, కంఠాభరణాలు ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. విగ్రహం ఎడమవైపు గరుత్మంతుడు నమస్కరిస్తూ ఉండగా, కుడివైపు లక్ష్మీదేవి విగ్రహం దర్శనమిస్తుంది. ఇది అప్పటి శిల్పుల సూక్ష్మతను తెలియజేస్తోంది.

## గజలక్ష్మి, సింహ శిల్పాలు,

## తామర ఆకృతులు

ఆలయ ద్వారాలపై చెక్కిన గజలక్ష్మి శిల్పం ఐశ్వర్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ద్వారపాలకులు, నీళ్లు అందిస్తున్న సేవకుల శిల్పాలు ఆ కాలంనాటి సామాజిక జీవన విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. క స్తంభంపై ఒకటి ఎక్కిన సింహ శిల్పాలు శక్తి, ధైర్యానికి ప్రతీకలుగా దర్శనమిస్తున్నాయి. అంతర్భాగంలోని తామర పువ్వుల ఆకారపు పైకప్పు, అష్టకోణ ద్వార నిర్మాణం, గర్భగుడిలో చెక్కిన తామర శిల్పాలు ధ్యాన భావాన్ని కలిగించేలా ఉన్నాయి.

## స్తంభాల్లేని రంగ మండపం

## ఓ పరిశోధన అంశం

ఆలయంలోని రంగ మండపంలో ప్రస్తుతం ఒక్క స్తంభం కూడా లేకపోవడం పురావస్తు నిపుణులకు మర్మంగా మారింది. సుమారు వందేళ్ల క్రితమే స్తంభాలు మాయమైనట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే ఆలయంలో నంది విగ్రహం లేకపోవడం కూడా పరిశోధనకు ఆస్కారం కల్పిస్తోంది.

## విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు, చాముండ

ఆలయానికి సమీపంలో ఉన్న విఘ్నేశ్వరుడి విగ్రహం శిల్పకళా పరంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పరహస్తాల్లో అంకుశం, పాశం, నిజహస్తాల్లో వరద ముద్ర, లడ్డుతో సుఖాసనంలో కూర్చున్న గణపతి భక్తులను ఆకట్టుకుంటున్నాడు. ప్రదక్షిణ పథంలో ఆంజనేయస్వామి విగ్రహం, శిరస్సులేని చాముండ విగ్రహం ఉండటం శైవ-శాక్త సంప్రదాయాల ఉనికిని సూచిస్తోంది.

## శాసనాల లేమి – మౌనంగా ఉన్న చరిత్ర

ఈ ఆలయ పరిసరాల్లో ఇప్పటివరకు ఎలాంటి శాసనాలు లభించకపోవడం వల్ల ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు అందుబాటులో లేవు. ఒకప్పుడు ఆలయానికి అనుబంధంగా ఉన్న పవిత్ర కోనేరు భూమిలో పూర్తిగా కూరుకుపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.

## నిర్లక్ష్యంతో నశిస్తున్న

## కాకతీయుల వారసత్వం

గతంలో గుప్తనిధుల ఆశతో కొందరు దుండగులు శివలింగాలను కదిలించడం, విష్ణుమూర్తి విగ్రహాన్ని తరలించేందుకు ప్రయత్నించడం ఆలయ పవిత్రతకు తీవ్ర ముప్పుగా మారింది. పురావస్తు శాఖ నిర్లక్ష్యం కారణంగా శిల్పాలు క్రమంగా చెరిగిపోతున్నాయని చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామస్తులే ఆలయ రక్షకులు

ప్రభుత్వ సహకారం లేకపోయినా, ముత్తారం గ్రామస్తులు ఈ ఆలయాన్ని తమ గ్రామ రక్షణ దేవాలయంగా భావిస్తూ స్వయంగా పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా మహాశివరాత్రి, కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

## పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలి

హనుమకొండ వేయి స్తంభాల గుడితో సమానమైన చారిత్రక విలువ కలిగిన ఈ ముత్తారం త్రికూటాలయాన్ని తక్షణమే పునరుద్ధరించి, హెరిటేజ్-ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే, కాకతీయుల భక్తి, శిల్ప వైభవం భవిష్యత్ తరాలకు సజీవంగా నిలిచే అవకాశం ఉందని చరిత్రకారులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన

# కైలాస కళ్యాణి క్షేత్రం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వంగర గ్రామం లోని కైలాస కళ్యాణి క్షేత్రం భక్తులతో కిటకిట లాడేందుకు సిద్ధమైంది. ఆలయాన్ని శోభాయ మానంగా అలంకరించి, భక్తుల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు నిరంతరంగా పూజలు చేయగలిగేలా నిర్వాహకులు అన్ని సౌకర్యాలను కల్పించారు. శివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతర అభిషేకాలు జరుగుతాయి. రాత్రి 7 గంటలకు శివ కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించడం ఈ క్షేత్ర ప్రత్యేకతగా భావిస్తున్నారు.



**ఆధ్యాత్మిక విశ్వాసంతో వెలుగులోకి వచ్చిన ఆలయం**


భారతరత్న, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు స్వస్థలం అయిన వంగరలో ఈ క్షేత్రానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలో గ్రామంలో భద్రతా ఏర్పాట్ల కోసం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దళాలు కాంపు ఏర్పాటు చేశాయి. ఆ సమయంలో ఒక సీఆర్‌పీఎఫ్ జవానుకు కలలో పరమేశ్వరుడు దర్శనమిచ్చి చెరువు మధ్యలో ఉన్న శిథిలావస్థలోని ఆలయాన్ని వెలికితీయాలని సూచించాడని స్థానికులు చెబుతారు. తదనంతరం దళాలు, గ్రామస్థుల సహకారంతో చెరువు దిబ్బపై పేరుకుపోయిన రాళ్లు, చెట్లు తొలగించగా ప్రాణవట్టం దెబ్బతిన్న సుమారు రెండున్నర అడుగుల శివలింగం బయటపడింది. దాని చుట్టూ త్రాచు పాము కూర్చున్న దృశ్యం భక్తుల్లో విశేష భక్తి భావాన్ని కలిగించింది. ఈ విషయం పి.వి. కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆగమ శాస్త్ర పండితులు పరిశీలించి ఈ ఆలయం కాకతీయ కాలానికి చెందినదని నిర్ధారించారు. పునర్నిర్మాణం చేపడితే గ్రామానికి ఆధ్యాత్మిక, సామాజిక అభివృద్ధి కలుగుతుందని సూచించారు.





**ప్రభుత్వ సహకారంతో పునర్నిర్మాణం**

పునర్నిర్మాణం కోసం నాటి ముఖ్యమంత్రి కొట్ల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ద్వారా సుమారు రూ.15 లక్షల నిధులు కేటాయించబడ్డాయి. ప్రజలపై ఆర్థిక భారం లేకుండా ఆలయ పునర్నిర్మాణం ప్రారంభమైంది. ఆలయానికి “కైలాస కళ్యాణి క్షేత్రం - హరిహర గాయత్రి ఆలయం”గా నామకరణం చేసి ఆధ్యాత్మిక గురువుల సమక్షంలో ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం నాటి దేవాదాయ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రత్యేక నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.



**కోర్కెలు తీర్చే క్షేత్రంగా విశ్వాసం**

ఈ ఆలయం కోర్కెలు తీర్చే క్షేత్రంగా భక్తుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కైలాసవాసుడు పరమేశ్వరుడు, కళ్యాణి అమ్మవారు, అనేక ఉపదేవతలతో ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచింది. గర్భగుడిలో ఒకేసారి సుమారు 20 జంటలు అభిషేకాలు చేసేలా నిర్మాణం చేయడం విశేషం. కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో భక్తులు కొబ్బరికాయ ముడుపులు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఆలయ అభివృద్ధి కోసం గ్రిల్, గ్రానైట్, కలరింగ్ వంటి పనులు దాతల సహకారంతో పూర్తి చేశారు. ఆలయ అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో ఇంకా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పి.వి. కుటుంబ సభ్యులు కూడా తరచూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నారు. శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు, గ్రామస్తులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. ఈ పవిత్ర సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించాలని ఆలయ నిర్వాహకులు పిలుపునిచ్చారు.



# ప్రేరణతో ప్రోత్సాహం

- **విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులు కావాలి**
- **విద్యార్థులు కష్టపడి చదవాలి**
- **విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యమే..**
- **కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా ప్రథమ స్థానం సాధించుటకు విద్యార్థులు మరింత శ్రమించి చదవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. శనివారం దేవరుప్పులలోని తిరుమల గార్డెన్‌లో మండలంలోని 11 పాఠశాలలకు చెందిన మార్చి 2026 SSC పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రేరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విజయోస్తు పుస్తకాలను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని తద్వారా ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత పొందుటకు వీలు కలుగుతుందని సూచించారు. అలాగే గత ఐదు సంవత్సరాల కింద 10వ తరగతి ప్రశ్నాపత్రాలను క్షుణ్ణంగా చదివి జవాబులను చదువుతో పాటు రాయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించుటకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సూచించారు. పరీక్షలు అంటే భయం లేకుండా నమ్మకంగా ఉండాలని, చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమేనని అందుకు నాణ్యమైన పౌష్టిక ఆహారం తో పాటు సరిపడా నిద్ర కూడా పోవాలని తెలిపారు. గత సంవత్సరం జిల్లాలో టాప్ మార్కులతో నిలిచిన టాపర్ లను ప్రేరణగా తీసుకొని ప్రతి ఒక్కరు ఉత్తమ మార్కులు సాధించాలని, దృఢ సంకల్పంతో నిరంతరం కృషి చేయాలని సూచించారు. అలాగే గత సంవత్సరం దేవరుప్పుల మండలంలో 546 ఉత్తమ మార్కులతో నిలిచారని, ఈసారి అంతకంటే ఎక్కువ మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఎంఈఓ జి కళావతి, మోటివేషన్ స్పీకర్ డా.వి.బ్రహ్మా రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ ఈటూరు శ్రీనివాస్ రావు, సర్పంచులు కృష్ణమూర్తి, రవి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**